క్లుప్తంగా

కృష్ణుడికి ప్రత్యేక పూజలు



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

ఓజిలి: మండలంలోని ఇనుగుంటలో ఉన్న శ్రీకృష్ణ మందిరంలో శుక్రవారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మందిరంలో నిర్వహించిన కుంకుమార్చన పూజలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని, భక్తిశ్రద్ధలతో పూజ లు చేశారు. రాత్రి రాధాకృష్ణుల కల్యాణం వేడుకగా నిర్వహించి, గ్రామస్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

నూతన పింఛన్ల పంపిణీ



పింఛన్ అందజేస్తున్న సర్పంచ్

సైదాపురం: స్థానిక పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నూతనంగా మంజూరైన పింఛన్లను పంచాయతీ సర్పంచ్ వీ శారద పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శులు ఇంద్రాణి, వంశీ, ఉపసర్పంచ్ శివకుమార్, నేతలు సుధీర్, రమేష్, సిబ్బంది శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అత్యుత్తమ ఫలితాల సాధనే లక్ష్యం



విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న ఎంఈఓ శంకరయ్య

పెళ్లకూరు: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధనే లక్ష్యంగా బోధన కొనసాగించాలని ఎంఈఓ శంకరయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని పెళ్లకూరు, కలవకూరు, అనకవోలు తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. పాఠశాలల్లో జరుగుతున్న నాడు–నేడు పనులపై ఆరా తీశారు. ప్రతి రోజూ విద్యార్థులకు దినచర్యలో భాగంగా చదవడం, రాయడం సంబంధించిన డైరీ రాయాలని చెప్పారు. అలాగే మధ్యాహ్న భోజనంపై ప్రత్యేక శ్రద్ధ చూపి, మెనూతో పాటు నాణ్యతా ప్రమాణాలు పాటించేలా జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. తరువాత విద్యార్థుల హోమ్‌వర్క్ పుస్తకాలు పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు.

కనుల పండువగా రాధాకృష్ణుల కల్యాణం



రాధాకృష్ణుల కల్యాణం చేస్తున్న అర్చకులు

రాపూరు: మండలంలోని మద్దెలమడుగులో ఉన్న రాధా సమేత గోపాలకృష్ణ మందిరంలో శుక్రవారం కృష్ణాష్టమిని పురస్కరించుకుని రాధాకృష్ణుల కల్యాణం రంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. రాధాకృష్ణుల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో కొలువుదీర్చి, విశేషాలంకరణ చేశారు. అనంతరం మంగళవాయిద్యాలు, వేదపండితులు మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేసినట్లు నిర్వాహకులు శశిధర్‌రెడ్డి తెలిపారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓలు

వాకాడు: మండలంలోని బుర్లవారిపాళెం ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులను శుక్రవారం అధికారులు ఘనంగా సన్మానించారు. పాఠశాల హెచ్‌ఎం భ్రమర, ఉపాధ్యాయురాలు కృష్ణమ్మ బుర్లవారిపాళెం పాఠశాలలో పనిచేస్తూ ఇటీవల బదిలీ కావడంతో వారిని ఎంఈఓలు నసీంఅలీ, బాబు శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు కస్తూరయ్య, శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో రుగ్మతలు దూరం



ఫిజియోథెరపిస్టు విజయమేరిని సత్కరిస్తున్న మహిళలు

నాయుడుపేట: ఫిజియోథెరపీతో పలు రుగ్మతలు దూరం అవుతాయని ఫిజియోథెరపిస్టు విజయమేరి అన్నారు. ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆమెను పలువురు శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. ఆమె మాట్లాడుతూ చాలామంది వ్యాయమం చేయక వ్యాధి నిరోధక శక్తి తగ్గి అనేక వ్యాధుల బారినడుతున్నట్లు తెలిపారు.



■ కోట్లపూడి శ్రీనివాసులు కాశీపురం గ్రామానికి చెందిన కౌలు రైతు. ఇతను తన గ్రామంలోనే ఓ ఆసామి వద్ద నాలుగు ఎకరాల పొలం లీజుకు తీసుకుని ఎడగారు వరి సాగు చేశాడు. ఎకరాకు 40 నుంచి 45 బస్తాల ధాన్యం దిగుబడి సాధించాడు. ఈ సారి ప్రభుత్వం అండతో పుట్టి(860 కిలోలు) ధాన్యం రూ.19 వేలు ధర పలకడంతో ఎకరాకు సుమారు రూ.70 వేలు రాబడి వచ్చింది. ఆ లెక్కన 4 ఎకరాలకు రూ.2.80 లక్షల ఆదాయం వచ్చింది. ఖర్చులు, లీజు పోను ఎకరాకు రూ. 45 వేలు వరకు ఇతనికి మిగిలింది. దీంతో ఆయన ఆనందం వ్యక్తం చేస్తున్నాడు.



■ వాకాడు గ్రామానికి చెందిన వల్లం బాలయ్య కౌలు రైతు. ఈయన వాకాడు ఎలగాలమ్మ మాను వద్ద 5 ఎకరాలు పొలం లీజుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. గతంలో ఇదే పొలం సాగు చేస్తే ఆదాయం రాకపోగా చివరికి అప్పులు పాలయ్యాడు. ప్రస్తుతం రైతు భరోసా కేంద్రాల ద్వారా రాయితీలు, రెండేళ్లుగా ధాన్యానికి మంచి ధరలు పలకడంతో ఈయన అప్పుల నుంచి కోలుకున్నాడు. ఈ సారి కూడా 5 ఎకరాల్లో ఖర్చులు పోనూ రూ.1.50 లక్షలు వరకు ఆదాయం రావడంతో ఆయన కుటుంబ సంతోషంగా ఉంది.

ధాన్యం.. అధరహో

పుడమి పుత్రుడు నేలతల్లిని నమ్ముకున్నాడు.. కాయకష్టం చేశాడు.. ఆరుగాలం శ్రమించి, రూ.వేలు ఖర్చు చేసి, పంట సాగు చేశాడు. ప్రకృతి కరుణించడంతో అధిక దిగుబడులు సాధించాడు. ప్రభుత్వం అండగా నిలవడంతో అ'ధర'హో అన్న రీతిలో ధరలు లభించడంతో లాభాల పంట పండింది. ఫలితంగా అన్నదాత ఇంట సిరుల వాన కురిసింది.

- పుట్టి(860కిలోలు) ధాన్యం రూ. 19 వేలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

వాకాడు: మండలంలో ఎడగారు సీజన్ వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రభుత్వ ప్రోత్సాహంతో రైతులు పండించిన ధాన్యానికి ఈసారి మంచి ధరలు దక్కుతున్నాయి. మండలంలో 6,521 మంది రైతులు సుమారు 15 వేల హెక్టార్ల విస్తీర్ణంలో వివిధ రకాల వరి వంగడాలు సాగు చేశారు. పంట సాగుకు రైతు భరోసా కేంద్రాల నుంచి సాగు రాయితీలు, ఎరువులు అందుకున్నారు. వాతావరణం అనుకూలించడంతో అధిక దిగుబడులు వచ్చాయి. దీనికితోడు గతంలో రూ.13 వేలు నుంచి రూ.14వేలు వరకు ఉన్న పుట్టి ధాన్యం (860 కిలోలు) ధర నేడు ప్రభుత్వం అండతో రూ.19 వేలు వరకు రైతుకు లభించింది. ప్రస్తుతం మంచి దిగుబడులతోపాటు తగిన గిట్టుబాటు ధరలు లభించడంతో వ్యవసాయం లాభసాటిగా ఉందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎకరా సాగులో ఖర్చులు పోనూ రూ. 40 వేలు వరకు ఆదాయం లభిస్తుందని రైతులు చెబుతున్నారు. సాధారణంగా ఒక ఎకరా సాగులో రైతులు వ్యవ ప్రయాసాల కోర్చి స్వల్పంగా 2 నుంచి 3 పుట్ల వరకు ధాన్యం దిగుబడులు తీసేవారు. అయితే ఈ ఏడాది ఎకరా పొలంలో 4 నుంచి 4.5 పుట్ల వరకు దిగుబడి వచ్చింది. దీంతో రైతులు అధిక ఆదాయం సాధించారు.



వరి కోస్తున్న యంత్రం

మంచి ధరలు పలుకుతున్నాయి



కనీ విని ఎరుగని రీతిలో ఈ సారి ధాన్యానికి అంత ధర పలకడం చాలా సంతోషంగా ఉంది. ప్రస్తుతం పుట్టి ధాన్యం ధర రూ. 19 వేలు ధర పలుకుతుంది. నాకు ఎలగాలమ్మ మాను వద్ద ఒక ఎకరా పొలం ఉంటే అందులో 4 పుట్లు ధాన్యం దిగుబడి రాగా రూ. 72 వేలు వచ్చింది. పెట్టుబడులు పోనూ ఎకరాకు రూ. 45 వేలు వరకు మిగిలింది.

- కుంబాల మస్తానయ్య, రైతు, వాకాడు

ధరలు ఇలాగే కొనసాగాలి



మునుపెన్నడూ లేని విధంగా ఈ సారి ధాన్యం ధరలు రైతుకు ఆనందాన్ని కలిగిస్తున్నాయి. రోజురోజుకు ధాన్యం ధరలు పెరుగుతున్నాయి. ఇంకా పుట్టి రూ. 19 వేలు నుంచి రూ. 20 వేలుకు పెరిగినా ఆశ్చర్యం లేదు. ఇలా ధరలు వస్తే ఇకపై రైతులు అప్పులు చేయాల్సిన అవసరం లేదు.

- భార్గవ్‌రామ, రైతు, వాకాడు

అధికారుల సలహాలు పాటించాలి



మాట్లాడుతున్న ఏఏబీ చైర్మన్

సూళ్లూరుపేట రూరల్: వ్యవసాయంలో అధిక దిగుబడి సాధనకు రైతులు అధికారుల సలహాలు పాటించాలని ఏఏబీ చైర్మన్ ఎం.దేవేంద్రరెడ్డి తెలిపారు. సూళ్లూరుపేట ఏడీఏ కార్యాలయంలో శుక్రవారం రైతులతో మండల వ్యవసాయ సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అగ్రి ల్యాబ్‌లో మట్టి నమూనాలను ఉచితంగా పరీక్షలు చేయించుకుని, పంట సాగు, ఎరువులు వాడాలలన్నారు. రైతులకు ఉపయోగ పడే పంట కాలువల్లో పూడిక తీయాలని అధికారులకు సూచించారు. రబీ సాగుకు ఆర్బీకేలో ఎరువులు అందుబాటులో ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ అనిత, ఏఓ కవిత తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిత



విద్యార్థులకు యూనిఫామ్ అందజేస్తున్న భరత్

రాపూరు: నేటి పోటీ ప్రపంచంలో కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కరుణామయి విద్యాలయ సంస్థ నిర్వాహకులు భరత్ పేర్కొన్నారు. రాపూరు మండలంలోని రాపూరు, గోను పల్లె గ్రామాల్లోని కరుణామయి విద్యాలయంలో చదువుతున్న విద్యార్థులకు మూడు జతల యూనిఫామ్, బూట్లు, బెల్టు, డైరీలు ఉచితంగా పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ చదువుకోవాలన్న లక్ష్యంతో విజయేశ్వరిదేవి విద్యాలయాలు నెలకొల్పి విద్యార్థులకు కావాల్సిన పుస్తకాలు, యూనిఫామ్ ఉచితంగా అందిస్తుందని, విద్యార్థులు కష్టపడి చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి వెంకట్రాయులు, హెచ్‌ఎంలు శంకరయ్య, మస్తానయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చన



విశేషాలంకరణలో పోలేరమ్మ



ఆలయంలో ఏర్పాటు చేసిన కలశాలు

నాయుడుపేటటౌన్: శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా గ్రామదేవత పోలేరమ్మ ఆలయంలో భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చన పూజలు చేశారు. దేవాదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జీ సిద్ధయ్య, కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని షణ్ముగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు మోహన్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో అర్చకులు శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో షోడష గౌరీవ్రత పూజలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి బంగారు చీరతో అలంకరించి, కలశాలు, గౌరీ ప్రతిమలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు జరిపారు. అలాగే అఖిలాండేశ్వరిదేవి ఆలయంలో చివరి శుక్రవారం కావడంతో అమ్మవారికి విశేషాలంకరణ చేసి, పూజలు చేశారు. మూగాంబికాదేవి, బేరిపేటలోని మహాలక్ష్మి ఆలయం, నరసారెడ్డి కండ్రిగలోని మహాలక్ష్మి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కుంకుమార్చన పూజలు చేస్తున్న భక్తులు (ఇన్‌సెట్‌లో) బంగారు చీరలో పోలేరమ్మ

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

వెంకటగిరిరూరల్: మున్సిపాలిటీలోని 23వ వార్డులో శనివారం ఉదయం 6.30 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు నేదురుమల్లి కార్యాలయ వర్గాలు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నాయి. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొంటారన్నాయి. స్థానిక ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చాయి.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గూడూరురూరల్: పట్టణ, రూరల్ ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎల్ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గూడూరుటౌన్–1, గూడూరు 33/11 కేవీ నారాయణ సబ్‌స్టేషన్, టౌన్ హాల్ సబ్‌స్టేషన్లలో మరమ్మతు లు, లైన్లకు అడ్డంగా ఉన్న కొమ్మల నరికివేత కార ణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగు తుందన్నారు. అత్యవసర సర్వీసులు వారు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని, ప్రజలు సహకరించాలని కోరారు.

సూళ్లూరుపేటలో..

సూళ్లూరుపేట: పట్టణంలోని మన్నారుపోలూరులో ఉన్న 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతు కారణంగా శనివారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని సూళ్లూరుపేట పట్టణం, మండలంతో పాటు అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ట్రాన్స్‌కో అధికారులకు సహకరించాలని కోరారు.

మండల జట్ల ఎంపికకు 14 నుంచి క్రీడా పోటీలు

నాయుడుపేట: మండల స్థాయి జట్ల ఎంపికకు ఈనెల 14వ తేదీ నుంచి క్రీడా పోటీలు ప్రారంభం కానున్నట్లు ఎంఈఓలు ఎం శాంతి, మునిరత్నం తెలిపారు. నాయుడుపేట ఎమ్మార్సీలో శుక్రవారం మండల స్థాయి క్రీడా పోటీల ఎంపికపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈనెల 14 నుంచి 15 వరకు అండ్–14, అండర్ –17 బాలబాలికలకు క్రీడా పోటీలు నిర్వహణకు శ్రీకారం చుట్టాలన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచినవారిని మండల జట్లకు ఎంపిక చేస్తామని చెప్పారు. కబడ్డీ, టెన్నికాయిన్, వాలీబాల్, త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్ తదితర క్రీడలు జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. క్రీడలకు స్పోర్ట్ కోఆర్డినేటర్‌గా పుదూరు హైస్కూల్ పీడీ కోదండపాణి, పీడీ రాఘవేంద్ర, పీడీలు వ్యవహరిస్తారని చెప్పారు.

ఆర్థిక సాయం అందజేత



నగదు అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

గూడూరురూరల్: తోటి మెకానిక్ మృతి చెందడంతో గూడూరు టూవీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం మెకానిక్ హైదర్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. గూడూరులోని చిన్న మసీదువీధికి చెందిన మోటార్ బైక్ మెకానిక్ హైదర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో టూవీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, హైదర్ కుటుంబ సభ్యులను కలిసి రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. అలాగే హైదర్ ఇద్దరి పిల్లల పేరున రూ.35 నగదును పోస్టాఫీసులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఆ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని అసోసియేషన్ సభ్యులు భరోసా ఇచ్చారు.

చంద్రబాబు, లోకేష్‌ను వెంటనే అరెస్టు చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరురూరల్: ఎలాగైనా అధికారం దక్కించుకోవాలన్న కుటిల బుద్ధితో రాష్ట్రాన్ని తగలబెట్టాలని చూస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబు, లోకేష్‌ను వెంటనే అరెస్టు చేయాలని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు డిమాండ్ చేశారు. గూడూరులోని ఆయన నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఆదాయ పన్ను చెల్లించకుండా మోసం చేసిన చంద్రబాబుతోపాటు యువగళం పాదయాత్రలో ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొడుతున్న లోకేష్‌ను అరెస్టు చేయాలన్నారు. వైఎస్సార్ సీపీకి ప్రజల్లో ఉన్న ఆదరణను చూసి భయంతో చంద్రబాబు పుంగనూరులో అల్లర్లు సృష్టించారన్నారు. రెండు రోజులు కిందట ఆయన తనయుడు లోకేష్ ప్రశాంతంగా ఉన్న పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో టీడీపీ శ్రేణులను ఉసిగొల్పి, వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడులు చేయించారని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు వారి నుంచి తప్పించుకుని ఇళ్లల్లో తలదాచుకున్నా వదలకుండా ఇళ్లల్లోకి చొరబడి దాడులు చేసి, చిన్నపిల్లలు మహిళలను భయభ్రాంతులకు గురిచేశారన్నారు. పార్టీ కార్యకర్తల ముసుగులో ఉన్న రౌడీ షీటర్లు, గూండాలను గుర్తించి పోలీసులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. గూడూరు ఏఎంసీ చైర్‌పర్సన్ ఓ యమునమ్మ మాట్లాడుతూ టీడీపీ దౌర్జన్యాలను ఇక సహించబోమన్నారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు బీ విజయకుమార్, చిల్లకూరు జెడ్పీటీసీ సభ్యుడు ఎం. శీనయ్య, పార్టీ పట్టణ అధ్యక్షుడు బీ శ్రీనివాసులు, చిల్లకూరు, కోట మండలాల కన్వీనర్లు పరంధామరెడ్డి, సంపత్ కుమార్‌రెడ్డి, నృత్య అకాడమీ డైరెక్టర్ మంజుల, మొబీన్‌బాషా, రమేష్‌యాదవ్, ఎస్ శ్రీనివాసులు రెడ్డి, డీ కృష్ణారెడ్డి, ఏ మురళి, అజీజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాన్ని కాపాడుకుందాం



మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసరావు

నాయుడుపేటటౌన్: పట్టణ నడిబొడ్డున ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కాపాడుకునేందుకు అధికారులు ఉన్నత న్యాయస్థానం ఆశ్రయించేలా చర్యలు చేపట్టాలని అధికార పక్షంతోపాటు ప్రతిపక్ష నాయకులు సూచించారు. పట్టణంలోని నక్కలోళ్ల సెంటర్ వద్ద రహదారి పక్కనే ఉన్న దుకాణాలను తొలగించాలని న్యాయస్థానం నుంచి అందిన ఉత్తర్వుల మేరకు శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ శ్రీనివాసరావు, సీఐ నరసింహారావు అధ్యక్షతన అధికార, ప్రతిపక్ష నాయకులతో సమావేశం నిర్వహించారు. న్యాయస్థానం నుంచి అందిన ఉత్తర్వుల మేరకు రహదారిపై ఉన్న నక్కలోళ్ల దుకాణాలను తొలగించి న్యాయస్థానాన్ని ఆశ్రయించిన టీ బాల కృష్ణారెడ్డి స్థలానికి కేవలం నడక దారికి మాత్రమే ఇచ్చేందుకు కోర్టు ఉత్తర్వుల మేరకు చర్యలు చేపడతామని సీఐ పేర్కొన్నారు. ఈ విషయమై వెంటనే చర్యలు చేపట్టాలని న్యాయ స్థానం నుంచి ఉత్తర్వులు అంది ఉన్నాయని కమిషనర్ పెర్కొన్నారు. దీంతో అధికార పార్టీకు చెందిన స్థానిక మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, డీ రవి, టీడీపీ నాయకులు కే కృష్ణారెడ్డి, బీజేపీ నేతలు సీ సురేంద్ర, రాజశేఖర్ రెడ్డి, సీపీఎం నాయకులు ముకుందా, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వస్థలం వదులుకోకుండా, తిరిగి ఉన్నత న్యాయస్థానంలో తిరిగి కౌంటర్ వేయాలన్నారు.

కోటమ్మ దేవస్థానం అభివృద్ధి ప్రశంసనీయం



మండపాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోట: గ్రామదేవత కోటమ్మ దేవస్థానం అభివృద్ధి ప్రశంసనీయమని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తన సొంతూరు కోటలో జరిగిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. కోటమ్మ దేవస్థానం వద్ద నూతనంగా నిర్మించిన భక్తుల వసతి మండప సముదాయాలను ఆయన ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ ఎం ధనుంజయరెడ్డితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రసన్నకుమార్‌రెడ్డి మాట్లాడుతూ తన సోదరుడు నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి ఆలయాభివృద్ధికి ఎంతో కష్టపడి పనిచేస్తున్నారన్నారు. దాతల సహకారం రూ.30 లక్షలతో భక్తుల కోసం వసతి మండపాలను నిర్మించడం శుభపరిణామన్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమ్మవారి చల్లని దీవెనలతో మళ్లీ సీఎం అవుతారన్నారు. ఎం ధనుంజయరెడ్డి మాట్లాడుతూ నెల్లూరు జిల్లా అభివృద్ధిలో నల్లపరెడ్ల పాత్ర ఎంతో ఉందన్నారు. స్వర్గీయ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలుగుగంగను జిల్లాకు తీసుకువచ్చారన్నారు. ఆలయాభివృద్ధికి కృషి చేసిన పలువురిని ప్రసన్నకుమార్‌రెడ్డి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పల్లవ గ్రానైట్స్ అధినేత కే సుబ్బారెడ్డి, ఆలయ ధర్మకర్త ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు పీ సంపత్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ఎస్ రజిత్‌కుమార్‌రెడ్డి, కే భక్తవత్సల్‌రెడ్డి, ఎస్ రమణయ్య, సర్పంచ్ వెంకటరమణమ్మ, ఉపసర్పంచ్ భాస్కర్, ఎంపీటీసీ సభ్యుడు మొబీన్, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



మాట్లాడుతున్న డాక్టర్ మాధురి

సూళ్లూరుపేట: వ్యకిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరమవుతాయని గైనకాలజిస్టు డాక్టర్ మాధురి తెలిపారు. సూళ్లూరుపేట లయన్స్ క్లబ్ ఆఫ్ షార్ వారి ఆధ్వర్యంలో స్థానిక బాలికల జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులకు ఆరోగ్యం, పరిశుభ్రత అనే అంశాలపై ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ మాధురి అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే వ్యక్తిగతమైన పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రతను పాటిస్తే ఆరోగ్య సమస్యలను సగానికిపైగా నిరోధించవచ్చన్నారు. మరుగుదొడ్లు సౌకర్యాలు లేక చాలాచోట్ల మూత్ర విసర్జన చేయకుండా ఇబ్బందులు పడుతుంటారన్నారు. అలాంటి పరిస్థితులను అధిగమిస్తే ఆరోగ్య సమస్యలను రాకుండా ఉంటాయని సూచించారు. అనంతరం విద్యార్థినులు అడిగిన ప్రతి ప్రశ్నకు ఆమె సమాధానం ఇచ్చి, అవగాహన కల్పించారు. ఈ క్యాంప్‌నకు చైర్మన్‌గా అరుణకుమారి వ్యవహరించగా, సభ్యురాలిగా జానకి వ్యవహరించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాధురని లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కే ఆదిశేషారెడ్డి, కార్యదర్శి జెట్టి శ్రీనివాస్, కోశాధికారి అప్పారావు పాల్గొన్నారు.